# చట్టం అందరినీ సమానంగా చూస్తుంది

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి



విలేకరుల సమావేశం అనంతరం న్యాయవాదులతో పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**కవాడిగూడ:** చట్టం ఎప్పుడూ గుడ్డిది కాదని అందరిని సమానంగా చూస్తుందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బ్రిటీష్ వారసత్వం నుంచి భారతదేశ న్యాయవ్యవస్థ బయటపడాలనే ఉద్దేశంతో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడటం హర్షణీయమని అన్నారు. చట్టం గుడ్డిది కాదన్న సందేశం ఇచ్చేలా సుప్రీంకోర్టులో న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు తొలగించి న్యాయదేవత చేతిలో ఖడ్గం స్థానంలో రాజ్యాంగాన్ని ఉంచడాన్ని న్యాయవాదులుగా వారి చర్యలను అభినందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో న్యాయదేవత విగ్రహాల రూపాలను పూర్తిగా మారుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు టి. రంగారావుతోపాటు పెద్ద ఎత్తున అడ్వకేట్లు పాల్గొన్నారు.

# 'యోగ వాసిష్టం' విశ్వం ఐక్యతను చెబుతుంది

యోగవాసిష్టం గ్రంథం ప్రపంచ ఆధ్యాత్మిక అన్వేషకులను ప్రేరణ



గరికపాటి నరసింహా రావును సన్మానిస్తున్న షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు

**నల్లకుంట:** వాల్మీకి మహర్షి రచించిన యోగవాసిష్టం గ్రంథం విశ్వం ఐక్యతను నొక్కి చెబుతుందని మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. యోగ వాసిష్టం గ్రంథం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక అన్వేషకులను ప్రేరేపిస్తుందని చెప్పారు. షిరిడీ సాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 15న ప్రారంభమైన 'యోగ వాసిష్టం'(గురు తత్వం)పై ప్రవచనాలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా గరికపాటి నరసింహారావు యోగ వాసిష్టం గ్రంథంలోని నాలుగు, ఐదు, ఆరు అధ్యాయాలపై ప్రవచించారు.

◆ యోగ వాసిష్టం గ్రంథంలో మొత్తం 29 వేల శ్లోకాలు ఉన్నాయని, ఇదే గ్రంథం 'లఘు యోగ వాశిష్టం'పేరిట 6 వేల శ్లోకాలతో రూపొందించబడిందని తెలిపారు. యోగ వాసిష్టంలోని మూడు, నాలుగు అధ్యాయాలు మనిషి స్వేచ్ఛ, బుద్ధిని వివరిస్తుందని చెప్పారు. ఐదో అధ్యాయంలో ధ్యానం, ఆత్మ సాక్షాత్కారానికి దాని ప్రయోజనాన్ని వివరిస్తుందన్నారు. చివరిదైన ఆరో అధ్యాయం సంపూర్ణ జ్ఞానం పొందిన రాముని గురించి వివరించబడిందని పేర్కొన్నారు. స్వీయ, విశ్వం యొక్క ద్వంద్వ స్వభావాన్ని గ్రహించే సాధనంగా స్వీయ-జ్ఞానం, ధ్యానం యొక్క ప్రముఖ్యతను వచనము నొక్కి చెబుతుందని చెప్పారు.

# 'ముదిరాజ్'లను ఒకే కులంగా పరిగణలోకి తీసుకోవాలి

**కాచిగూడ:** ప్రభుత్వం చేపట్టే కులగణనలో ముదిరాజ్ కులస్తులందరిని ఒకే కులంగా పరిగణలోకి తీసుకుని లెక్కించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికి వచ్చి కులగణన చేసే అధికారులు, సిబ్బందికి విడివిడిగా ముదిరాజ్ కులాల పేర్లు చెప్పకుండా అందరూ ఒకే కులంగా ముదిరాజ్ కులం పేరు చెప్పాలని కోరారు. గత ప్రభుత్వం చేపట్టిన జనగణనలో ముదిరాజ్‌లు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని లెక్కలు చెబుతున్నాయని, కాని అధికారికంగా ఎక్కడా ప్రకటించలేదని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను వివిధ కులాలుగా విడదీసి లెక్కించడంతో జనాభా సంఖ్యను తక్కువ చేసి చూపే ప్రమాదం ఉందన్నారు. దీంతో ముదిరాజ్‌లు చాలా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూపు నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బీసీ కమిషన్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

# అనధికారిక స్టిక్కర్లు..
# వాహనదారులకు జరిమానాలు!



స్టిక్కర్లను తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్

**ఫిలింనగర్:** అడ్డదారుల్లో దూసుకెళ్తూ మోటార్ వాహనాల చట్టాన్ని ఉల్లంఘించి అనధికారిక స్టిక్కర్లు వేసుకుంటున్న వాహనదారులపై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్ నం.17 బరోడా బ్యాంక్ వద్ద నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై పోలీసు, ప్రెస్, ప్రభుత్వ వాహనం, ఎక్స్ కార్పొరేటర్, ఆర్మీ తదితర స్టిక్కర్లను అడ్డదారుల్లో ఏర్పాటు చేసుకుని తిరుగుతుండగా పట్టుకున్నారు.

◆ మొత్తం 22 వాహనాలపై ఇలా అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టిక్కర్లను అక్కడికక్కడే తొలగించి ఒక్కొక్కరికి రూ.700 జరిమానా విధించారు. వాహనాలపై నంబర్ ప్లేట్ తప్పితే ఇతర ఏ స్టిక్కర్లు ఉండకూడదని ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ తమ్మినేని గోపీతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని స్టిక్కర్ల తొలగింపుతో పాటు హెల్మెట్ లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా, రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులపై కూడా జరిమానాలు విధించారు.

◆ పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కూడా లేకుండా తిరుగుతున్న వారిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు విధించారు. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. సుమారుగా 75 వాహనాలపై నిబంధనల ఉల్లంఘనల కింద జరిమానాలు విధించినట్లు ఆయన వెల్లడించారు.

# నగలు, నగదు దొరకక
# చీరలు, కంప్యూటర్ మానిటర్‌తో పరార్!



ఇంట్లోని అల్మార పగులగొట్టిన దొంగలు



మెయిన్ గేట్ దూకి కాంపౌండ్‌లోకి ప్రవేశిస్తున్న దొంగ (సర్కిల్‌లో)



విజ్ఞానపురి కాలనీలో చోరీ జరిగిన ఇల్లు

**నల్లకుంట:** గుర్తు తెలియని ఆగంతకుడు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇంట్లో ఖరీదైన వస్తువులు, నగదు లభించక పోవడంతో అక్కడ దొరికిన ఆరు చీరలు, ఒక కంప్యూటర్ మానిటర్, రెండు పాత సెల్ ఫోన్‌లు తీసుకుని పలాయనం చిత్తగించిన దొంగ. పోలీసులు, ఇంటి యజమాని కథనం ప్రకారం వివరాలు.. విశ్రాంత వెటర్నరీ డాక్టర్ నారాయణ రెడ్డి భార్యతో కలిసి నల్లకుంట విజ్ఞానపురి కాలనీలో(2–1–647) నివాసముంటున్నారు. దసరా పండుగ అనంతరం ఈ నెల 13వ తేదిన భార్యాభర్తలిద్దరూ ఇంటికి తాళం వేసి స్వగ్రామమైన బొమ్మలరామారం మండలం మర్యాలకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో పని మనిషి సుజాత శుక్రవారం ఉదయం నారాయణ రెడ్డి ఇంటికి వచ్చి చూడగా ప్రధాన ద్వారం గది తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించింది.

◆ వెంటనే ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పడంతో వెంటనే వారు హైదరాబాద్ చేరుకున్నారు. తీరా చూడగా ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంటి వెనుక భాగంలో ఉన్న ఓ గదిలోకి దూరిన గుర్తు తెలియని ఆగంతకుడు అల్మార విరగొట్టి అందులోని వస్తువులను చిందరవందరగా పడవేశాడు. దొంగకు అందులో నగదు, బంగారు నగలు ఏమీ లభించలేదు. ఇంట్లో లభించిన ఆరు చీరలు, ఒక కంప్యూటర్ మానిటర్‌తో పాటు, వెనుక గదిలో లభించిన రెండు పాత సెల్ ఫోన్‌లు సర్దుకున్నాడు.

◆ అదే సమయంలో అక్కడి వరండాలో అమర్చిన గూగుల్ అలర్ట్, సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిక్స్ నుంచి సౌండ్ వచ్చింది. దీంతో ఇంట్లో అమర్చిన అలారం మోగిందనే భయంతో ఆగంతకుడు అక్కడి నుంచి పలాయనం చిత్తగించాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున 03.35 గంటల సమయంలో దొంగతనానికి వచ్చిన దుండగుడు కాంపౌండ్ వాల్ పై నుంచి దూకి ఇంటి ప్రాంగణంలోకి వస్తున్న దృశ్యం సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఇంటి యజమాని నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా
# మూసీ సుందరీకరణ చేపట్టాలి

- మూసీకి ఇరువైపులా ప్రహరీ నిర్మించాలి
- మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ మెరుగుపరచాలి
- అవసరమయ్యే నిధుల మంజూరుకు కృషి చేస్తా
- కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి



గాంధీనగర్‌లో హరిత అపార్ట్‌మెంట్ లేన్‌వద్ద రూ.54.45 లక్షల వ్యయంతో నూతన సీవరేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని

**చిక్కడపల్లి:** దశాబ్దాలుగా నివాసముంటున్న ప్రజల ఇళ్లను తొలగించొద్దని... తాము మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదని.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మూసీ సుందరీకరణ చేపట్టాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని హరిత అపార్ట్‌మెంట్ లేన్ వద్ద రూ.54.45 లక్షల వ్యయంతో నూతన సీవరేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... మూసీ నదికి ఇరువైపులా ప్రహరీ నిర్మించి సుందరీకరణ చేపట్టాలన్నారు. నగర్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించకుండా మూసీ సుందరీకరణతో హైదరాబాద్ అభివృద్ధి జరగదన్నారు. ముందుగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా వారి సౌకర్యార్థం మంచినీటి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరుస్తామన్నారు. దానికి అవసరమయ్యే నిధుల కేటాయింపులో తనవంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్ ఎల్లప్పుడు మద్దతు ఉంటుందని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేని కారణంగా అనేక ప్రాంతాల్లో మంచి నీటి పైప్‌లైన్లలో మురుగు కలవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.

◆ అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని చెప్పారు. వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఎంసీ ఖాదర్ మోహియుద్దీన్, ఏఎంఓహెచ్ ప్రవీణ, ఏఈ సలాం, ఎలక్ట్రిసిటీ ఏడీ ఏపీపీ సంపత్, ఏఈ సుధామ, ముషీరాబాద్ ఎంఆర్ఓ, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు సాయిచంద్, రమేష్‌రాం, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్‌రావు, రాకేష్, నరేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 11గంటల నుంచి 12.30గంటల వరకు విద్యు త్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. డీడీకాలనీ ఫీడర్ పరిధిలో బతుకమ్మ కుంట, రామచంద్రయ్య డిగ్రీ కాలేజ్, గ్లాస్‌కో 11 నుంచి 11.30గంటల వరకు.. పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, అంబర్‌నగర్, ఆజాద్‌నగర్, వడ్డెరబస్తీ, పటేల్‌నగర్ తదితర ప్రాంతాలలో 12గంటల నుంచి 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## రేపు సెల్ఫ్ డిఫెన్స్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

**కాచిగూడ:** హెల్త్ లీగ్ ఆధ్వర్యంలో కాచిగూడలో మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌లో ఈనెల 20వ తేదీన ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి 9:30 గంటల వరకు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ దామోదర్ నాయక్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్: 9247352281/7093128117.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైలు ఢీకొని గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీకొని గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి (50)ని ఈనెల 15వ తేదీన చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) జామై ఉస్మానియా–విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.

# డ్రైనేజీ పైప్‌లైన్‌లను ఆధునీకరించాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

**కవాడిగూడ:** డివిజన్‌లో కొంత కాలంగా నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్య కలుషిత నీటి సమస్యను అరికట్టేందుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ పనుల ఆధునీకరణ కోసం ప్రతిపాదనలు సిద్ధ చేయాలని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ కోరారు. శుక్రవారం కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ నేతలు వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఎంసీ మహేందర్‌బాబు, కేశవరాజుతో కలిసి ఆమె వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

◆ ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ... డివిజన్‌లోని కొత్త బజార్, మేయిన్‌రోడ్‌నుంచి మజీద్‌లైన్, శివాజీచౌక్, తాళ్ళబస్తీ, మల్లయ్యహోటల్, భాగ్యలక్ష్మినగర్ నుంచి చిత్రాల నగర్ వరకు కాలం చెల్లిన పైప్‌లైన్ ఉండడం వల్ల నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లడంతో తాగునీటిలో కలిసి కలుషితం అవ్వడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని జలమండలి ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పురాతన డ్రైనేజీ పైప్‌లైన్ పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. చిన్నపాటి వర్షం పడినా మ్యాన్‌హోల్స్ నిండి పోయి డ్రైనేజీ రోడ్లపై పారుతుందన్నారు.

◆ ప్రస్తుతం పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల ఆధునీకరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఆమె తెలిపారు. ఈ విషయం పట్ల జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీని ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నేతలు స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ నృత్యంలో మార్పులు తీసుకురావాలి



నృత్య గురువు ఆర్.ప్రసన్నరాణిని సత్కరిస్తున్న సముద్రాల వేణుగోపాలచారి,ఓలేటి పార్వతీశం

**చిక్కడపల్లి:** మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ నృత్యంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి పేర్కొన్నారు. నృత్యం నేటి తరానికి ఆసక్తి కలిగించేలా ఉండాలన్నారు. శుక్రవారం రాత్రి నృత్య కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ప్రముఖ నాట్యాచార్యులు, వేదాంతం జగన్నాథశర్మ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యగురువు ఆర్.ప్రసన్నరాణికి జరిగే పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసన్నరాణికి వేదాంతం జగన్నాథశర్మ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సాహితవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, హంస పురస్కార గ్రహీత ఉషాగాయిత్రి, మద్దాళి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనం

**లిబర్టీ:** ప్రేమ, కరుణా, దయతో ఇతరులకు చేయూతనివ్వాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. మానవత్వం చాటి చేయూతనిచ్చినప్పుడే సమాజంలో వ్యక్తులకు సంస్థలకు గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. డాక్టర్ ఎస్.ఆదినారాయణ మాట్లాడుతూ.. ఎంత ఆస్తి అంతస్తులు ఉన్నా సంస్కారం లేకపోతే వ్యక్తులకు సమాజంలో విలువ ఉండదన్నారు.నీతిని జాయితీ నిబద్ధతతో జీవితం సాగించాలని సూచించారు.

# విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్

**కాచిగూడ:** తెలంగాణలోని కమ్మరం, వడ్రంగం, కంచరం, శిలాశిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న వారందరిని ఒకే కులస్తులుగా పరిగణించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ రాష్ట్ర ప్రభుత్వానికి, బీసీ కమిషన్‌కు, ప్లానింగ్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన జనగణనలో వృత్తులనే కులాలుగా భావించిన ప్రభుత్వాలతో విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాలలో నిర్లక్ష్యం చేయబడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా జరుగబోతున్న బీసీ కులగణనలో పంచదాయ వృత్తిదారులను ఒకే కులంగా గుర్తించాలని కోరారు. ఈమేరకు బీసీ కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లాలుగోట వెంకటచారి, చొల్లేటి కృష్ణమాచారి, రాగిఫణి రవీంద్రాచారి, పులిగిళ్ల శ్రీనివాసాచారి, దేవరకొండ వీరాచారి, నాగారం భాస్కరాచారి, నారోజు జగ్‌జీవన్, వీణవంక సందానందం, లక్ష్మీ రామాచారి, శశిధర్ శిల్పి, రంగు లక్ష్మణాచారి, పెద్దకొలిమి బ్రహ్మాచారి, ఉట్కూరి కిషన్, చెన్నోజు రవికిరణ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మదన్‌మోహన్

## ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

**కాచిగూడ:** ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు రూ.2లక్షల కోట్ల దుర్వినియోగంపై న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేసి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్లలో దళిత జాతుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. ఈ ప్లాన్‌కు సంబంధం లేని విభాగాలకు ఖర్చులు చేసి దుర్వినియోగం చేశారని ఆయన పేర్కొన్నారు. 2014 నుండి 2024 వరకు అక్టోబర్ వరకూ పెట్టిన ఖర్చులు, ప్రోగ్రామ్ కార్యచరణ రిపోర్ట్‌లపైన సమగ్ర శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిధుల మళ్లింపుపై ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఈ అంశంపైన భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు మాతంగి హనుమంతు, మద్దెల ప్రవీణ్ కుమార్, చిప్పరి సుబ్బారావు, గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 31న నింబోలిఅడ్డ సదర్ వేడుకలు

**కాచిగూడ:** దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 31వ తేదీన నింబోలిఅడ్డ సదర్ వేడుకలను నిర్వహిస్తున్నామని యాదవ సంఘం చైర్మన్ నందకిషోర్ యాదవ్ తెలిపారు. 31వ తేదీన కాచిగూడ నింబోలిఅడ్డ, కొత్తపేట, నార్సింగి, రామంతాపూర్‌లలో, నవంబర్ 1వ తేదీన ఖైరతాబాద్, సైదాబాద్, కార్వాన్, ఆసిఫ్‌నగర్, అమీర్‌పేట, బోయిన్‌పల్లి, నల్లగుట్ట, బొల్లారం, మచ్చ బొల్లారం, బజార్‌ఘాట్, గుడి మల్కాపూర్ ప్రాంతాల్లో, 2వ తేదీన నారాయణగూడలో సదర్ వేడుకలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. యాదవులు సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని వారు సూచించారు.

## రామాయణ పారాయణ అనుగ్రహ పత్రం అందజేత



**నల్లకుంట:** సరస్వతీ సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు దివంగత పోపూరి శంకర శర్మ కుమార్తె ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తి దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాది రామయ్య సన్నిధిలో నిర్వహించిన శ్రీ రామాయణ మహాపారాయణ, సుందరాకాండ పారాయణంలో పాల్గొన్నారు. శుక్రవారం ఆమెను ఆలయం తరపున శాలువాతో సన్మానించి, జ్ఞాపిక– శ్రీరామాయణ పారాయణ అనుగ్రహ పత్రం అందజేశారు. అనంతరం ఆమె పారాయణ బృందంతో కలిసి అయోధ్య బయలుదేరి వెళ్లారు. అక్కడ బాలరాముడి సన్నిధిలో వారం రోజుల పాటు విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొంటామని శాంతామూర్తి చెప్పారు.

## విమానం టికెట్లు ఇప్పిస్తానని మోసం..

**అంబర్‌పేట/కాచిగూడ:** ముంబాయిలో జరిగిన అంతర్జాతీయ వైద్యుల సదస్సుకు హాజరయ్యే వారికి విమాన టికెట్లు ఇప్పిస్తానమంటూ డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై బాధితులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన సుభాష్ చంద్రగుప్తా కుద్బిగూడలోని పుల్లారెడ్డి రాయల్ అపార్ట్‌మెంట్‌లో లోటస్ హాలిడే పేరిట ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్నాడు. విదేశాల నుంచి వచ్చిన 42 మంది డాక్టర్లకు విమాన టికెట్లు ఇప్పిస్తాని సాయి వృందా ఏజెన్సీ నుంచి రూ.26.59 లక్షలు తీసుకుని విమాన టికెట్లు ఇప్పించకుండా పరారయ్యాడు. దీంతో ఏజెన్సీ మేనేజర్ హరీష్ సెప్టెంబర్ 25న కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దాదాపు నెల రోజులు కావస్తున్నా.. ట్రావెల్ నిర్వాహకుడు పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో బాధితులు గురువారం అంబర్‌పేటలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్యలకు ఫిర్యాదు చేశారు.

## కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



**చిక్కడపల్లి:** డివిజన్‌లోని వాల్మీకినగర్ బస్తీ సమీపంలోని ఉదయం సూర్య అపార్ట్‌మెంట్స్ వద్ద శుక్రవారం రాత్రి ఆకస్మాత్తుగా చెట్టు కూలింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పావని ఆదేశాల మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి రోడ్డుపై పడిన చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. నేతలు ఉమేష్, నర్సింహ్మా, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌లో స్పెషల్ డ్రైవ్

**చాదర్‌ఘాట్:** వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో వారం రోజుల పాటు చెత్తకుప్పల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్–1 అధికారి చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉల్లిగడ్డల సీజన్ నేపథ్యంలో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో సంబంధిత కాంట్రాక్టర్‌తో చెత్తను తొలగిస్తున్నామన్నారు. అదేవిధంగా మార్కెట్‌లో దుకాణదారులు కూడా చెత్తను డ్రైనేజీలో వేయకుండా చెత్తకుండీల్లో వేయాలని కోరారు. గ్రేడ్–3 అధికారి పుష్ప, మాధురి తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంత నిర్మాణానికి ఉచిత సేవలు



జలమండలి డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ

**చాదర్‌ఘాట్:** ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకునేవారికి జలమండలి తరపున ఉచితంగా సాంకేతిక సిబ్బంది సేవలు అందిస్తారని మలక్‌పేట జలమండలి డివిజన్–1 డీజీఎం సయ్యద్ హస్మత్‌అలీ తెలిపారు. మలక్‌పేట జలమండలి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే తమ పరిధిలో 300 గజాల పైన నివాసాల్లో ఇంకుడు గుంతలు లేని వాటిని గుర్తించామని తెలిపారు. వారికి అవగాహన కల్పించడంతో పాటు నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎవరైనా తమ ఇళ్లలో ఇంకుడు గుంత నిర్మించాలనుకుంటే జలమండలి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించాలని సూచించారు.